# పందిట్లో పెళ్ళవుతోంది

సన్నగా విన్పిస్తోంది సన్నాయి దూరం నుంచి. డాబామీద కూర్చున్న రాజారావు చాలా సేపటినుంచీ వింటూనే వున్నాడు. అతని చూపులు ఆకాశానికి అతుక్కుపోయినా మనస్సు అల్లకల్లోలంగా పరుగులు తీస్తోంది.

"రేవతి ... పెళ్ళవుతోంది. రేవతికి పెళ్ళవుతోంది." ఎవరోవచ్చి తెలీని విషయం చెప్తోన్నట్టు తనకు తనే చెప్పుకున్నాడు. "నిజంగా ... పెళ్ళవుతోంది రేవతికి." నమ్మకంలేని తనను తను నమ్మించుకున్నాడు.

"రేవతికి పెళ్ళా ?" విస్మయంగా మబ్బులలోకి గుచ్చి గుచ్చి చూశాడు. నిండుగా దీపాలతో ప్రకాశిస్తోన్న పెళ్ళి పందిరీ — పందిరికింద కళ్యాణంబొట్టుతో తల దించుకు కూర్చున్న రేవతీ - రేవతి సరసన... ఎవరదీ ? ఎవరో ? ఎవరు ?... తనుకాదు. కాదు, తనుమాత్రం కాదు. తనెందుకు కాదు ?... తను కాకపోయినా పెళ్ళవుతోంది రేవతికి ... నిశ్చలంగా కూర్చున్న రాజారావు తీక్షణంగా చూడసాగాడు ఎటో.

అమ్మమాత్రం ఎందుకిలా జరగనిచ్చింది? మేనకోడలిని ... రేవతిని ... మురిసిపోతూ ఎదురుచూసిన కోడలిని. ఎందుకింత తేలికగా దూరం చేసుకుంది? రేవతి... నిజంగా ... అమ్మ కోడలు కావాల్సింది కాదూ ?... నిజంగా...

నిజంగానే రేవతి మేనత్త కోడలు కావాల్సిందే.

రాజుబావ పెళ్ళాం అవ్వాల్సిందే.

రేవతి పుట్టిననాడే ఆపెళ్ళి నిర్ణయమైపోయింది. అన్నా చెల్లెళ్ళు అనుకోకపోయినా, వదినా మరదళ్ళు ఒట్టేసుకోకపోయినా, వూళ్ళోవాళ్ళు వంతపాడకపోయినా - ఆ పెళ్ళి జరగనే జరిగింది అందరి మనసుల్లోనూ.

చిన్నప్పుడు బొమ్మలాటల్లో మొగుడూ పెళ్ళాల్లాగే ఆడుకున్నారు రాజూ రేవతీ. పెళ్ళాంమీద చూపించాల్సిన కోపం, అధికారం అన్నీ రేవతిమీదే ఛలాయించాడు రాజు. మొగుడుమీద చెయ్యాల్సిన ఫిర్యాదులన్నీ అత్తముందు ఏకరువు పెట్టింది రేవతి. అన్నిటికీ చిరునవ్వే ప్రదర్శించింది రాజుతల్లి కాంతమ్మ — "నీ మొగుడే కాదుటే ? వాణ్ణి నువ్వే మంచి చేసుకోవాలిగానీ నన్నేం చెయ్యమంటావ్ ?" అంటే సరి కంటికి కన్పించకుండా సిగ్గుతో పరిగెత్తేది రేవతి.

నాలుగేళ్ళపాటు రాజూ రేవతీ జంటగా చదువుకున్నారు బళ్ళో. రేవతి బావగారి దగ్గిర పాఠాలు చెప్పించుకుని చీకటి పడితే యింటికి వెళ్ళకుండా అత్తపక్కలో పడుకునేది కథలు వింటూ. రాజుకూడా వాళ్ళమ్మ పక్కలో జేరితే తను వూఁ కొట్టటం మానేసి కళ్ళుమూసుకుని నెమ్మదిగా నిద్రలోకి జారిపోయేది.

రాజు థర్డుఫారం పాసయ్యాక చిన్నబడీ, బడితోపాటు స్వంత వూరూ మారాల్సి వచ్చింది. మేనత్తగారివూళ్ళో హైస్కూల్లో ఫోర్తుఫారంలో చేరాడు రాజు.

* * *

మొట్టమొదటిసారి అర్నెల్ల శెలవులకే యింటికి వచ్చాడు రాజు — బావ వచ్చిన కబురు తెలిసి వాళ్ళమ్మతో గబగబా తల దువ్వించుకుని అందంగా బొట్టు పెట్టించుకుని పెద్దపెద్ద పువ్వులపరికిణీ కట్టుకుని బొమ్మల పెట్టి పట్టుకుని పరిగెత్తుకు వచ్చింది రేవతి.

పొడుగులాగూ పొడుగుచొక్కా తొడుక్కుని తిరుగుతోన్న రాజు అందంగా పెద్దవాడిలా కన్పించాడు.

"ఒరేయ్! రేవతి వచ్చిందిరా రాజూ!" అని వాళ్ళమ్మ చెప్పేవరకూ రాజు రేవతిని చూడనేలేదు. రేవతి అత్త వెనకాల దాక్కుంది. రాజు నవ్వాడు ... అదోలా, పెద్దవాడిలా, "నేను వాళ్ళింటికి వెళ్దామనుకుంటున్నానే అమ్మా!" అన్నాడు రేవతిని చూస్తూ.

"అదే వచ్చిందిగా? మన చావిట్లో ఆడుకోండి," అనేసి వాళ్ళమ్మ వంటపాకలోకి వెళ్ళిపోయింది,

"అదేం పెట్టి రేవతీ?" అన్నాడు రాజు దగ్గిరకొస్తూ. రేవతి చక్కగా నవ్వింది— "మొన్న మా అమ్మ కొండమీదికి వెళ్ళిందిగా? కొత్త కొత్త బొమ్మలూ, లక్కపిడతలూ చాలా తెచ్చింది. ఎంత బావున్నాయనుకున్నావ్?'' అంటూనే భళ్ళున పెట్టిలో సామానంతా గుమ్మరించింది. లక్కపిడతలు తలోమూలకీ పరిగెడుతోంటే రాజుకూడా గబగబా ఏరితెచ్చాడు. ''ఇందులో పాతవి కూడా ఎందుకుంచావు? ఛీ! రంగులుపోయి విరిగిపోయి ఏం బావున్నాయనీ?" అన్నాడు.

"పోనీ బావా! వుంటేనేం ?" అంటూ కాస్సేపు పాతబొమ్మల కేసి ప్రేమగా చూసింది రేవతి—గబగబా కొత్తవీ పాతవీ వేరువేరుగా పెట్టింది. ''నిజంగా...ఇప్పుడు బావున్నాయికదూ బావా ?"

రాజు మాట్లాడకుండా ఓ బొమ్మ చేతులు గిరగిరా తిప్పుతూ కూర్చున్నాడు.

"బావా! అలా వెనక్కి తిప్పితే విరిగిపోతుందని చెప్పిందేం మా అమ్మ ?''

ముప్పాళ రంగనాయకమ్మ



"పోనీ! విరిగిపోతే పోనీ? ఎన్నా ళ్ళుంటుం దేమిటి?"

నిజమే. ఎన్నాళ్ళుంటుం దేమిటి? మళ్లా కొనుక్కోవచ్చుగా?

''బావా!'' రేవతి రాజు మొహంలోకి చూస్తూ అంది— "నేను ఒక్కసారికూడా ఆడుకోలేదు. కమలావాళ్ళు ఆడుకోటానికి నా బొమ్మ లన్నీ తెమ్మన్నారు. ఊహూ! ఇవ్వ నన్నాను. నువ్వు వచ్చాక...మనం ఇద్దరం ఆడుకుంటాంకదూ? వాళ్ళ కెలా యిస్తాను చెప్పు?...ఏం బావా! అత్త నడిగి కొంచెం కందిపప్పూ బెల్లంముక్కా తీసుకురానా? ఎంచక్కా మనం ఆడుకుని ఎన్నాళ్ళయిందనీ?" చటుక్కున లేచినిలబడి బొడ్లోంచి ఓ అణాబిళ్ళ తీసి చూపించింది— ''మనల్ని కొనుక్కోమని మా అమ్మ యిచ్చింది. ఆ హైహియ్యాక చెంచురామయ్య కొట్టు కెళ్ళి కొనుక్కుందామా? నీకు బఠాణీలు నచ్చుతాయికదూ? పోనీ యిప్పుడే కొని తీసుకురానా ఆడుకుందుకి...?''

''ఛ! యిప్పు డేం ఆటలేవే! నే నేం నీలా ఆడపిల్ల ననుకున్నావా?" రాజు నవ్వుతూనే అన్నాడు.

''మరి...నువ్వు...నాతో ఆడేవాడివి కాదూ?"

''అప్పుడు చిన్నవాడినేగా?''

విస్మయంగా చూసింది రేవతి. బావ తనతో ఆడుకోడా? పెద్దవా డై పోయాడా? అయితే యేం? అడుగుదా మనుకొంది. ఊరుకొంది.

"బొమ్మ లన్నీ చూశానుగా, పెట్లో పెట్టెయ్. కమలావాళ్ళతోనే ఆడుకో. మీ రంతా ఆడపిల్లలు కాబట్టి బావుంటుంది.''

నెమ్మదిగా పాతబొమ్మలూ కొత్త బొమ్మలూ అన్నీ కలిపి పెట్లో వేసి మూత పెట్టింది రేవతి — ''ఏం చెయ్యమంటావ్?" అన్నట్టు చూసింది.

"నీ పుస్తకాలు తెచ్చుకోలేకపోయావా? చూసేవాణ్ణిగా? పోనీ సాయంత్రం తెచ్చుకో."

అలాగే నన్నట్టు తల వూయించింది. రాజు లేచాడు. "నేను మురళీవాళ్ళింటికి వెళ్తాను. నువ్వు మా అమ్మదగ్గిర కూర్చుం టావా?"

ఆశ్చర్యంగానే చూసింది రేవతి. మురళీ వాళ్ళింటికి తనూ వస్తేనేం? ఎన్నిసార్లు బావా తనూ కలిసి వెళ్ళలేదు?

రాజు వీధిలోకి వెళ్ళిపోయాడు. రేవతి అడుగులో అడుగు వేసుకుంటూ యింట్లోకి నడిచింది — "అత్తా! బావ నాతో ఆడుకోలేదు. నన్ను కూడా తీసుకు వెళ్ళలేదు." అని చెప్పెయ్య బుద్ధి వేసింది — అత్త బావని అడిగితే...? బావకి తన మీద కోపం వస్తే...?

''ఆదేమే అలా నించున్నావ్? వా దేడీ?" అంటూ కాంతమ్మ అడుగుతోంటే విన్పించుకోకుండా —

"మా యింటికి వెళ్ళిపోతున్నా నత్తా !" అంటూ పరిగెత్తింది. రెండు రోజులవరకూ రేవతి రాలేదు.

''అమ్మా ! రేవతి రాదేమే ? " అంటూ రెండుమూడుసార్లు అడిగాడు రాజు.

''నువ్వు రాగానే అది సంబరపడుతూ వస్తే దాన్ని వదిలేసి ఎటో పోయావుగా ?" అంది వాళ్ళమ్మ.

ఆ సాయంత్రం వచ్చింది రేవతి.

''నీకు కోపం వచ్చిందా రేవతీ ? మా అమ్మ అంటోంది,'' అన్నాడు రాజు – రేవతి నవ్వింది. ''ఛీ ! నా కేం కోపం రాలా ?" – రాజుకి జాలేసింది. రేవతికి ఎన్నో కబుర్లు చెప్పాడు, మరెన్నో కబుర్లు అడిగాడు. రోజూ రమ్మన్నాడు, తెలీని లెక్కలవీ చెప్తా నన్నాడు– రేవతి అన్నిటికీ సంతోషంగా ఒప్పేసుకుంది.

మర్నాడు...రాజు రేవతి కో లెక్క చేయటాని కిచ్చి తను రాసుకోటాని కుపక్రమించాడు – "అయ్యో ! సిరా లేదు. కలం కడిగి పోసుకుంటాను." అనుకున్నాడు.

''నేను కడిగి తేనా బావా ?" అంది రేవతి పలక క్రింద పెడుతూ.

"నువ్వు లెక్క చెయ్యవూ ?"

"తర్వాత చేస్తాగా?"

"కలం కడగటం వస్తుందా నీకు?"

"ఎందుకు రాదు? బాగా కడిగి తెస్తాను." రాజుచేతిలో కలం పట్టుకుని దొడ్లోకి పరిగెత్తింది. ముత్యంలా కడిగి తెచ్చింది. సిరా పోసుకున్నాడు రాజు.

"రేవతీ! కొంచెం సూదీదారం తెస్తావా?"

మారు మాట్లాడకుండా పరిగెత్తింది– ఎంతకీ వూడిపడని రేవతికోసం చూసీ చూసీ విసుగొచ్చింది రాజుకి. "అమ్మా ? రేవతి సూది తెస్తా నని పోయింది. ఏమైందే?'' అంటూ గావుకేక పెట్టాడు యింట్లోకి.

''బావుందిరా ! అదెక్కడ తెస్తుంది ? మొన్న పాతగుడ్డలు కుట్టి ఎక్కడ పెట్టానో ఏమో కవ్పించలే దన్నాను. మళ్ళా నీ దగ్గరికి రాలా?''



ఒగుర్చుకుంటూ పరిగెత్తుకు వచ్చింది రేవతి సూదివెంట బారెడుదారం వ్రేలాడేసుకుని– "అత్త లేదంది బావా! మా యింటికి వెళ్ళాను. అమ్మ యిచ్చింది. గమ్మున వచ్చేశానుకదూ?"

రాజుకి మళ్ళా జాలివేసింది. సూది అందుకున్నాడు. రేవతి దగ్గిర కూర్చుంటూ అడిగింది– "ఎందుకు బావా నీకు సూది?"

"ఎందు కనుకుని తెచ్చావు?"

"ఏమో! నా కేంతెలుసు? నువ్వు కావలన్నా వని తెచ్చాను."

రాజు తెల్లకాయితాలు మడత పెడుతూ రేవతి కేసి చూశాడు–– "నేను నోడ్సు కుట్టుకుని కొత్తలెక్కలు చేసుకోవాలి."

లెక్కల సంగతి గుర్తు వచ్చింది రేవతికి. పలక ఒళ్లో పెట్టు కూర్చుంది. కాంతమ్మ ఏదో పనిమీద గదిలోకి వచ్చింది– "ఒరేయ్, పుస్తకా లన్నీ ఎంత చిందర వందరగా వున్నయో చూసుకున్నావా? కాస్త సర్దుకోరాదూ? మళ్లా రాసుకుందువుగాని," అంది మందలింపుగా.

రేవతి ఒళ్లో పలక మళ్లా కింద పడేసింది. "నువ్వు పుస్తకం కుట్టుకో బావా! లెక్కలు చేసుకోవా లన్నవుగా? నేను సర్దుతాలే," అంటూ లేచింది.

"నువ్వా లెక్క చెయ్యాలిగా? కూర్చో. నే సర్దుకుంటాలే."

"నువ్వు పుస్తకం కుట్టుకోకపోతే మీ మేష్టారు కొడతారు గానీ నేను లెక్క చెయ్యకపోతే నన్ను నువ్వు కొడతా వేమిటి?" – నవ్వింది రేవతి.

"చెప్తోంటే నీ క్కాదూ? ఆ పుస్తకా లన్నీను వ్వెలా సర్దగలవ్?"

"ఎందుకు సర్దలేను? పెద్ద వన్నీ ఓ దగ్గిరా, చిన్న వన్నీ ఓ దగ్గిరా పెడతాను. అలమరంతా దుమ్ము లేకుండా శుభ్రంగా దులిపేస్తాను. అంతేగా?" ఉత్సాహంగా చేతులు తిప్పింది. రాజు పుస్తకం కుట్టుకొంటూ వారవారగా చూస్తూ కూర్చున్నాడు – పుస్తకాలు సర్దుతోన్న రేవతి కెవ్వు మంటూ అరవబోయింది – పాముపిల్లని చూసినట్టు.

"బావా! బావా! బీడీ ముక్క ఛీ! నీ పుస్తకంలో వుంది."

"ఏయ్ రేవతీ! గట్టిగా అరవకు." ఉరిమిచూశాడు రాజు. పిల్లిపిల్లలా దగ్గిరికి వచ్చింది రేవతి – భయం భయంగా అడిగింది – "నువ్వు...బీడీలు కాలుస్తావా బావా?"

"ఏం కాలిస్తే? తప్పేం లేదు."

"ఛీ! తప్పులేదూ? అత్తకి తెలిస్తే తిట్టదూ?"

"ఎలా తెలుస్తుంది? నువ్వు చెప్తావా?"

"ఆఁ, ఎందుకు చెప్పను? నువ్వు తప్పుపని చెయ్యటంలా?" –చెంగున పరిగెత్తింది ఇంట్లోకి.

"అత్తా! అత్తా!"

"రేవతీ! రేవతీ!" అంటూ వెంట పడ్డాడు రాజు.

"ఏమిట్రా ఆ గోల? ఏమైంది? ఎందుకే అలా అరుస్తావు?"

"చూశావా అత్తా? బావ..." బావకేసి చూసింది రేవతి. బావ చూపుల నిండా అంతులేని దీనత్వం! మొహ మంతా పొంగుకొస్తోన్న దుఃఖం– మూగవాడిలా కన్పించాడు బావ! కళ్లతోనే అర్థించాడు బావ!

"ఏవిఁటే అలా నిలబడ్డావ్? ఏమన్నాడు బావ?"

"ఏమీ అనలే దత్తా! కాసిన్ని ... మంచి నీళ్ళు తెమ్మన్నాడు."

రాజు పరిగెత్తుకు వెళ్ళిపోయాడు చావిట్లోకి. రేవతి మంచినీళ్ల గ్లాసు పట్టుకుని నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్లింది– గ్లాసు అందుకుని నీళ్లన్నీ గడగడా తాగేశాడు రాజు –– "రేవతీ! కూర్చోవే!"

"నీకు కోపం వచ్చిందా బావా?"

"ఛీ! లేదు. నువ్వు చెప్పలేదుగా?"

"చెప్పను బావా! ఎప్పుడూ చెప్పను." నిశ్శబ్దంగా కూర్చున్న రేవతి మనస్సు కుదుటపడలేదు ... "బావా! నువ్వు బీడీలు కాల్చటం మానేస్తే బావుండదూ?"

"మానేస్తాను రేవతీ! తప్పకుండా మానేస్తాను. ఇం కెప్పుడూ కాల్చనుగా?"

"అవును బావా! చుట్టలవీ కాలిస్తే జబ్బు చేస్తుందటకదూ?"

"నిజమే! నాకు తెలుసు."

"ఒసేయ్ రేవతీ! అస్తమానూ యిక్కడే కూర్చుంటే మీ అమ్మ తిట్టదుటే?" అంటూ వచ్చింది కాంతమ్మ– "నీ చదువుసంధ్యలు మానుకుని వాడితో నీ తిరుగు డేమిటే? చేతి కందిన ఆడపిల్లవి. తల్లికి కాస్త సాయం లేకపోతే ఎలాగే?" అత్త కసురుతోంటే బిక్క మొహం వేసింది రేవతి.

* * *

స్కూలు ఫైనల్ పాసయ్యాడు రాజు.


రేవతి చదువు థర్డుఫారంతో ముగిసిపోయింది.

"మాలతి హైస్కూల్లో చదువుతోంది. నువ్వూ చదువుకుంటే బావుంటుంది రేవతీ!" అన్నాడు రాజు. రేవతి ఆమాట వాళ్ళమ్మతో చెప్పింది. ఆవిడ ఒప్పుకోలేదు– "వాళ్ళ వూళ్ళోనే పెద్దబడి వుంది కాబట్టి మాలతి చదువుకుంటోంది. వాళ్ళ మేనత్తయిల్లే కాబట్టి రాజుకూడా వెళ్ళి చదువుకున్నాడు. నిన్ను చదువుకుందుకు వాళ్ళింటికి పంపితే ఏం బావుంటుందీ? అయినా ఎంత చదివి మాత్రం ఏం చెయ్యాలిలెద్దూ?" అని కూతురు మాట తోసిపారేసింది.

"పెద్దచదువు చదువుకోకపోతే పెళ్ళి కాదని భయమా ఏమిటే? నీ రాజు బావ వుండనే వున్నాడుగా?" అంటూ నవ్వేసింది.

రేవతి మాటాళ్ళేదు. బావ చదువుకుంటున్నాడుగా? తర్వాత బావదగ్గిరే తను చదువుకుంటే సరి.

కాని...కాలేజీ చదువు చదువుకుంటోన్న రాజుబావ దగ్గిరికి పైటలు వేసుకోవటం ప్రారంభించిన రేవతి మునుపటిలా వెళ్ళలేకపోయింది.




బావ నిజంగా పెద్దవా డయ్యాడు. బావే కాదు, తనూ పెద్ద దైంది. సరదా వేస్తే చీరలుకూడా కట్టుకుంటోంది. చిన్నపిల్లలా దగ్గిర నిలబడి ఎలా మాట్లాడుతుంది ?

రాజుకూడా రేవతితో చనువుగా మసల టం చాలావరకు తగ్గించేశాడు. చిన్నప్పుడు గడిపిన రోజు లవీ మర్చిపోకపోయినా వాటి కేమంత ప్రత్యేకతలేదు రాజుదృష్టిలో.

రాజు కాలేజీనుంచి ఎప్పుడు యింటికి వచ్చినా అతనికి సదుపాయా లవీ చూసే బాధ్యత రేవతిమీదే పడేసేది కాంతమ్మ- రాజుకి పొద్దుటే కాఫీటిఫెన్లు కావాలి_ బస్తీలో బాగా అలవాటు చేసుకున్నాడు. కూరలు కూడా ఎప్పటిలా వండిపెడితే యిష్టంగా తినటం మానేశాడు. మధ్యాన్నం మూడింటి కల్లా వేడివేడి టీ కావాలి.

ఆ సదుపాయా లన్నీ రేవతి మూలంగానే జరుగుతున్నా యని రాజుకి తెలీనివిషయం కాదు. తల్లి అనారోగ్యపు మనిషి. పైగా పూజలూ, పునస్కారాలూ ఆవిడ ధోరణి ఆవిడది. ఒక్క కాఫీ టిఫెన్లవరకే కాదు. రాజు బైటికి వెళ్ళగానే అతని గదంతా అద్దంలా సర్ది పక్క దులిపి తలుపులు వెయ్యటం, బస్తీచాకలికి బట్టలు వేసి తిరిగి ఇస్త్రీబట్టలు పద్దుచూసి పెట్లో సర్దటంలాంటి పను లన్నీ రేవతి ఎవ్వరూ చెపకుండానే చేస్తోం దనికూడా తెలుసు.

''రేవతీ! కొంచెం మంచినీళ్లు తీసుకొ స్తావా?" అని రాజు అడిగితే నిశ్శబ్దంగా నీళ్ళ గ్లాసు అందిస్తుంది. "అబ్బాయి స్నానం చేస్తున్నాడమ్మా!" అని కాంతమ్మ హెచ్చ రించే లోపునే పీటముందు సమస్తం వడ్డించి తలుపువెనక్కి తప్పుకుంటుంది. తనలోతను రాజు నవ్వుకునే నవ్వు- బావ మొహంలో కన్పించే ఆ కాంతి చాలు రేవతి తృప్తికి.

"రేవతీ! నా మూలంగా నువ్వు చాలా శ్రమ పడుతున్నావు." నిద్ర లేచేసరికి వేడి వేడి టీ ఫ్లాస్క్ టేబుల్‌మీద పెట్టి వెళ్తోన్న రేవతిని చూస్తే ఏదో అభిమానం పొంగి వచ్చింది రాజుకి. రేవతి చేసే పనులకు మెచ్చుకోవటం అలా వుంచి కనీసం కృతజ్ఞతాభావా న్నయినా వెల్లడించ లేదు ఎప్పుడూ. ఆ రోజు అప్రత్నంగానే అనేశాడా నాలుగు మాటలూ. సిగ్గు పడ్డట్టు తల దించేసుకుంది రేవతి. రాజు మంచం మీదనుంచి లేచి కొంచెం దగ్గిరికి వెళ్లాడు_ ''అస్తమానం నాకోసం ఏదో చాకిరీ చేస్తోంటే నీకు విసుగు వెయ్యటంలేదూ?'' అడగా లనిపించే అడిగాడు.

"ఛ! అవేం మాటలు ?" మంద లిస్తూన్నట్టు చూసింది.

''నిజంగానే రేవతీ! నువ్విలా యాతన పడుతోంటే నాకే సిగ్గువేస్తోంది. అమ్మకి చెయ్యటం రాకపోతే మానెయ్యమని చెప్తాను. ఏం ఫర్వాలేదు_"

"బావా!" రేవతి వేల చూపులు చూస్తూ మాట్లాడింది. "నా గురించి నువ్విలా ఎందు కనుకుంటున్నావోగానీ నేనేం యాతన పడటం లేదు. నీ కోసం చేసే పనులన్నీ ఎంతో సంతోషంగా చేస్తున్నాను."

అర్థంకానివాడిలా చిలిపిగా అడిగాడు రాజు _ "నాకు చాకిరీ చెయ్యా లంటే నీకంత సంతోషం దేనికో !"

రేవతి పెదవులమీద నవ్వు నిలిచింది. "ఇది చాకిరీయా ?"

"మరి?"

"నీ సుఖం కోసం నీ సంతోషం కోసం చేసే పని చాకిరీ ఎలా అవుతుంది బావా ?"

"ఏమౌతుంది ? వేయి జన్మల తపస్సౌతుందా ?"

"తప్పకుండాను. తపస్సు చేసైనా నిన్ను సంతోష పెట్టా లనే నేను కోరు కుంటున్నాను."

"అబ్బా ! నీ కోరిక తీరకపోతే ?"

"ఎందుకు తీరదు ? నువ్వు హృదయం లేనివాడివా ?"

''నాకు హృదయం వుందని నువ్వెలా అనుకుంటున్నావు ?"

"నువ్వు మనుషివికావా ?"

"ప్రతీ మనిషికీ హృదయం వుంటుందా రేవతీ ?"

"అదేమో నాకు తెలీదు. నీకు మాత్రం హృదయం వుంది. అంత వరకూ నాకు తెలుసా."

రాజు నవ్వాడు _ "అయితే నా సుఖ సంతోషాలే నీ జీవిత ధ్యేయ మన్నమాట."

"ఇకనుంచీ అదే నా ధ్యేయంగా చేసుకుంటాను. నువ్వు వెటకారంగా అన్నా దానిని మార్చుకోను."

మరి నిలబడకుండా వెళ్ళి పోతోన్న రేవతిని చూసి నవ్వుకున్నాడు రాజు.

మాష్టర్ డిగ్రీతోపాటు మంచి వుద్యోగం కూడా సంపాదించుకుని యింటికి వచ్చాడు రాజు.

రాజు వాళ్ళమ్మతో ఏమిటేమిటో కబుర్లు చెప్తోంటే వింటూ తలుపు వెనకే నిలబడింది రేవతి. బావకి కన్పించటానికి బొత్తిగా సాహసం చెయ్యలేకపోయింది - బావ కంఠస్వరం విన్నంత మాత్రానే సిగ్గు ముంచుకు రాసాగింది. ఇక తమ పెళ్ళికి ఏ ఆటంకాలూ లేవు - ఆ సంగతి బావకి తెలుసు. తనకు తెలుసనికూడా బావకు తెలుసు.

ఆ తర్వాత ఓ వారం రోజులవరకూ రేవతి యిల్లుకదలి రాలేదు. కాంతమ్మ నాలుగైదు కబుర్లు పంపితే సంధ్యవేళ బయల్దేరివచ్చింది - మంచంలో పడి మూలుగుతోన్న అత్తని చూస్తూ నిర్ఘాంతపోయింది. గతరాత్రినుంచీ దగ్గూ ఆయాసం ఎక్కువయ్యాయి. మందూ మాకూ వాడటం లేదు. కళ్ళ చివర ప్రాణాలు నిలుపుకుని వుంది అత్త. రేవతికి చాలా కోపం వచ్చింది. బా వేం చేస్తున్నా వత్తా ?'' అంది దగ్గిర కూర్చుని వీపు నిమురుతూ - కాంతమ్మ ఆయాసంతో ఏమీ చెప్పలేకపోయింది. రేవతి తటపటాయిస్తూ లేచి నిలబడింది. గదిలో మంచంమీద బోర్లా పడుకుని తల గడ మీద పుస్తకం పరుచుకుని చదువుకుంటూన్న రాజు గుమ్మందగ్గిర గాజుల చప్పుడుకు తల తిప్పి చూశాడు. లేచి కూర్చున్నాడు.

"ఏమిటి ? ఏమైనా కావాలా ?" చాలా రోజుల తర్వాత రేవతిని అంత దగ్గిరగా చూస్తూ పల్కరిస్తోంటే రాజుకి కూడా తడబాటు కల్గింది.

రేవతి నేలచూపులు చూస్తూనే అంది- ''అత్తకి ఒంట్లో బాగాలేదు. నీకు తెలీదా?''

ఒక్క క్షణం వూరుకున్నాడు రాజు- "ఎందుకు తెలీదు?"

విస్మయంగా చూసింది రేవతి "తెలిసి...వూరుకున్నావా ?"

''ఏం చెయ్యాలి ?"

"ఏం చెయ్యాలా ? తెలీకే అడిగావని చెప్పనా ? జబ్బు వస్తే మందూ మాకూ లేకుండా..."

"మందు దేనికి ? అమ్మదగ్గిర తాయెత్తు వుందిగా ?"

అర్థం కానట్టు చూసింది రేవతి.

"అమ్మ నీ కేం చెప్పలేదా ? దారే పోయేవెధవ మాటలు నమ్మి ఐదురూపాయలిచ్చి తాయెత్తు కొంది. మ నందరికీ పట్టిన శని పోతుందట. నేను ఎన్నో విధాల చెప్పాను. విన్లేదు సరే ! ఆ తాయెత్తుకాస్తా మెడలో కట్టుకుని అర్ధరాత్రి లేచి తలారా చన్నీటి స్నానాలు ప్రారంభించింది."

"అమ్మా ! నీ ఆరోగ్యం మంచిది కాదు. నా మాట విను; జబ్బు చేస్తుంది." అని గోలపెట్టాను.

''ఆ సర్వేశ్వరుడు చల్లగా చూస్తే ఏదీ రాదు. ఏపుట్టలో ఏపాముందో? ఈ తాయెత్తు ప్రభావంతో మనశని విరగడైతే..."

''అసలు మన కేం శని వుందమ్మా?"

"అది తెలుస్తుందట్రా ?''- అంటూ వితండవాదం మొదలుపెట్టింది- చూశావ్‌గా? శని వుందోపోయిందో మీ అత్తనే అడుగు.''

రేవతి మాట్లాడలేదు.

"వివేకం లేనివాళ్ళతో వేగటం కష్టం." రాజు విసుక్కున్నాడు- రేవతి కోపంగానే అంది- "అత్తకి వివేకంలేదు. నిజమే. చేజేతులా జబ్బు తెచ్చుకుంది- అందుకని మూర్ఖత్వంతో వైద్యుణ్ణి పిలవకుండా మందూ మాకూ వాడకుండా చూస్తూ వూరుకుంటావన్నమాట,తల్లిబాధపడుతోంటే భీష్మించుకు కూర్చున్న నీ వివేకం ఎంత గొప్పదో !"

గిర్రున తిరిగి వెళ్ళిపోయింది రేవతి.

తర్వాత రాజు బైటికి వెళ్ళాడు. డాక్టర్ వచ్చాడు. కాంతమ్మకి మర్నాటికి కాస్త ఆయాసం తగ్గింది.

''నీకు బాగా కోపం వచ్చినట్టుందే నామీద !" వంటింటి గడపదగ్గిర నిలబడి నెమ్మదిగా అడిగాడు రాజు. పొయ్యిముందు కూర్చున్న రేవతి నుదురూ చెంపలూ ఎర్రగా కుంకుం అద్దుకున్నట్టే కన్పించాయి.

"నిజంగా కోపమేనా రేవతీ !''

తల దించేసుకుంటూ అంది రేవతి - ''చాల్లే, నా కేం కోపం !"

''ఏమో ! వచ్చిం దనుకున్నాను. నాకు వివేకం లేదన్నావుగా ?"

"నీకు వివేకం లేకపోతే కోపం రావాల్సింది నాకు కాదు. వచ్చినా యిప్పుడు కాదు.'' రేవతి పాపిడి ముత్యాలకోవలా కన్పిస్తోంటే చూస్తూ వింటున్నాడు రాజు - ''నా మీద నువ్వు కోపం తెచ్చుకునే సమయం అంతా ఎప్పుడో వుందన్నమాట." పెదవి కొరుక్కుంటూ లేచి వేడినీళ్ళగ్లాసు తీసుకు అత్తదగ్గిర కెళ్ళిపోయింది రేవతి.

* * *

రేవతి స్పష్టంగా తెలిచేసింది తన కోరిక. ఆమె కళ్ళలో ఎన్నో ఆకారూపాలు గోచరించాయి తనకు. అందుకేనా తను అంత అమానుషంగా ప్రవర్తించాడు ? - తనను తను ప్రశ్నించుకున్నాడు రాజారావు. అలాగే మబ్బుల్లోకి చూస్తూ తనను తను అర్థం చేసుకోవాలన్న ప్రయత్నం సాగించాడు.

రేవతి కోరిక ఎంత సమంజసంగా తోచిందో అంత దారుణంగానూ అనిపించింది. ఎంత మధురానుభూతి కల్గించిందో అంత ద్వేషాగ్నినీ రగుల్కొల్పింది- రేవతి తనకు భార్య అవుతుందా? అవ్వాలని కలలు కంటోందా? తను...? తను మాత్రం రేవతిని ఆశించటం లేదూ ? రేవతిని ప్రేమించటం లేదూ ?— ఏమీ అర్థం కాలేదు రాజుకి.

ఆరోజు... దీపాలవేళ మామయ్య వచ్చాడు. ఎందుకు వచ్చాడో తెలుసు. బైటికి పోకుండా తనగదిలో కూర్చున్నాడు- అమ్మా మామయ్యా మాట్లాడుకుంటోన్న మాటలన్నీ స్పష్టంగా విన్పిస్తున్నాయి.

"మనలోమనకి లాంఛనా లేమిటన్నయ్యా? కొడుకుని కంటే మాత్రం నీతో అడిగించు కునేంత దా న్నయ్యానా?"

"కాదులేమ్మా కాంతం! ఈ లాంఛనా లన్నీ యథాతథంగా జరుపుకోవటం మన వేడుక్కేగా? ఎంత అన్న గారి నైనా నేను ఆడపిల్ల తండ్రిని కాకపోను. నీ కొడుక్కి యిస్తానని అడగరావటంలో నాకు సంతోషమేకాని చిన్నతన మేమీలేదు. మన మాట ఎలా వున్నా అసలు పెళ్ళి చేసుకుని కాపురం చేసుకోవలసినవాళ్ళు వున్నారుగా? వాణ్ణికూడా ముఖాముఖీ అడిగి..."

"కొత్తగా మాట్లాడుతున్నా వేమి టన్నయ్యా? ఈ సంగతేం వాడికి తెలియనిదా? వాడి మనసు మనం ఎరుగనిదా?" రాజు విసురుగా పచార్లు సాగించాడు. తన మన స్సేమిటో వీళ్ళ కేం తెలుసు? తన పెళ్ళి నిర్ణయించటానికి వీ ళ్ళెవరు?

"రాజూ!"—తల్లి పిలుపు విన్పించింది. రాజు ఒక్కక్షణం నిశ్చలంగా నించున్నాడు—అంగలు వేసుకుంటూ చావిట్లోకి వెళ్ళాడు.

"మామయ్య వచ్చాడు. ఇలా వచ్చి కూర్చోరా!"


రాజు రెండడుగులు ముందుకు వేశాడు. కూర్చోలేదు.

"మామయ్య ఏమంటున్నాడో విన్నావా?" నవ్వుతూ అంది తల్లి.

"ఏమిటి?" తన కంఠం తనకే కర్కశంగా విన్పించింది రాజుకి.

మామయ్య మేనల్లుడి కేసి చూస్తూ అన్నాడు—"లాంఛనయుతంగా మీ ఇద్దర్నీ అడిగివెళ్దా మని వచ్చానురా! మరేంలేదు. అందరం అనుకుంటున్నదే. మీ రిద్దరూ పెద్దవాళ్ళయ్యారు. ఇంకా ఆలస్యం చెయ్యటం సమంజసం కాదు. బయల్దేరేముందు రేవతిని కూడా పిల్చి అడిగాను. మనస్ఫూర్తిగా చెప్పింది—'బావని పెళ్ళి చేసుకోవటం నా కిష్టమే నాన్నా!' అంది..."

"రేవతిని పెళ్ళాడ్డం నా కిష్టం లేదు మామయ్యా!" గుండెల్లో కొట్లాడుతోన్న




మాటలు వెళ్ళగక్కేశాడు రాజు. మామయ్య చెప్తోన్న వుపోద్ఘాతం వింటోన్నకొద్దీ అట్టుడికినట్టే వుడికిపోయిన రాజు పదేపదే రెట్టించాడు— "నా కిష్టంలేదు, ఊహూ! నా కేంతమాత్రం యిష్టం లేదు— రేవతిని నేను పెళ్లి చేసుకోను. చెప్పేశానుగా!"

తెల్లబోయినట్టు చూశాడు మామయ్య. కంగారుపడింది తల్లి— "ఏమిటి రాజూ? ఏమిట్రా? ఏమిటంటున్నావు?... మామయ్య నీ పెళ్లి సంగతిరా అడుగుతోంట. రేవతికీ నీకూ పెళ్లి చేస్తా నంటున్నాడురా! మ రేం కాదు."

"నా కేం మతి పోలేదమ్మా!" తీక్షణంగా చూశాడు రాజు— "నేను చెప్తున్నదీ నా పెళ్ళి మాటే. నేను రేవతిని చేసుకోను. చేసుకోను. చేసుకోను. తెలిసిందా?" ఖిన్నురాలై పోయింది తల్లి. అన్నగారి మొహంలోకి చూడ లేకపోయింది.—అసలు జరుగుతోన్న దేమిటో అర్థం చేసుకోవటానికే కొంత సేపు పట్టింది.

మామయ్య అనునయంగా అన్నాడు— "రాజూ! మీ చిన్నతనంనుంచీ అనుకున్న మాటా..."

"లేదు. లేదు మామయ్యా! నే నెప్పుడు అనుకోలేదు. రేవతిగాని అనుకుంటే నే నేం చెయ్యను? అనుభవించమని చెప్పు."

"రాజూ!" మామయ్య లేచినించున్నాడు. అలాగేలేరా! నీ కింత అయిష్టమని వింటే రేవతిమాత్రం నిన్నెందుకు కోరుకుంటుంది?" తృళ్ళిపడ్డట్టు చూశాడు.

రాజు విసురుగా అడుగులు వేసుకుంటూ వెనక్కి తిరిగాడు.

కాంతమ్మ పిచ్చిచూపులు చూస్తూలేచింది. "అన్నయ్యా! వాడి కేమిటో అయింది—వాడి మన స్సేం బాగాలేదు, రెండురోజులు ఆగు. నామాట విను. తప్పకుండా ఒప్పుకుంటాడు."

"అమ్మా!" గది గుమ్మంలో నిలబడి అరిచాడు రాజు— "రెండురోజులు కాదు. రెండు సంవత్సరాలైనా నా నిర్ణయం మారదు. మామయ్యకి చెప్పు. రేవతికి చెప్పమను— తన కెంత యిష్టంవున్నా నేను పెళ్ళి చేసుకోనని చెప్పమను." — తడబడుతూ గదిలోకి పోయి కూర్చున్నాడు. కాంతమ్మ యిల్లు దాటి వెళ్ళిపోతూన్న

అన్నగారికేసి చూసి బావురుమంది. గుండెలు దడదడా కొట్టుకుంటోంటే కూలబడిపోయింది.

రాజు కదలలేదు. శిలలా కూర్చున్నాడు ఎంతోసేపు.

''రాజూ!'' పిరికి కంఠంతో పిల్చింది తల్లి — ''ఏమిటి నాయనా! నీకు ఒంట్లో బాగాలేదా?''

మాట్లాడలేదు రాజు.

"నువ్వేందుకిలా చేసావో నాకు భయంగా వుందిరా! నువ్వంటే రేవతి కెంత ప్రాణమో నీకు తెలీదూ? దాని కింత అన్యాయం చేస్తావా??'

"............"

"ఇప్పటికిప్పుడు నీ మనస్సెందుకిలా మారిపోయింది నాయనా? మీ యిద్దర్నీ కన్నుల పండువుగా చూసుకోవాలని మురిసిపోతున్నాను. నా మురిపెమంతా ఏం కాను?"

రాజు చిరాగ్గా జుట్టులోకి వేళ్ళు గుచ్చుకున్నాడు.

"నా మాట అలా వుంచు. రేవతి నీ మీద ఎన్ని ఆశలు పెట్టుకుంది! దాని ఆశలన్నీ నాశనంచేస్తావా చెప్పు? పాపం రేవతి... పిచ్చి పిల్ల..."

''వీల్లేదు వీల్లేదు." రాజు మనస్సు శాసించింది. గుప్పెళ్ళు బిగబట్టాడు— "రేవతి ఆశలు తీరటానికి వీల్లేదు. రేవతి కోరికలు తీరనివ్వను. ఊహూ!'' ఎర్రటి గుడ్లతో కర్కశంగా కన్పిస్తోన్న రాజు మొహం చూస్తే భయంవేసింది తల్లికి.

రాజు తీక్షణంగాచూశాడు తల్లికేసి— రేవతికి తనంటే ఇష్టమా? తనమీద ఎన్నో ఆశలు పెట్టుకుందా? అవన్నీ తనే తీర్చాలంటోందా అమ్మ?— తన కోరికలన్నీ ఎవరు తీర్చారు? తన యిష్టమేమిటో ఎవరు గ్రహించారు. మాలతి ... మాలతి అంటే ఎంతయిష్టం తనకి! ఎంత ప్రాణం తనకి! మాలతి తనకు దూరమౌతోంటే ఏం చేసిందీ అమ్మ? మాలతిమీద తన కున్న కోరిక ఎందుకు పట్టించుకోలేదీ అమ్మ?

తన కోరిక తీరలేదు. రేవతి కోరిక ఎందుకు తీర్చాలి? తనని మాలతే లక్ష్య పెట్టలేదు. తను రేవతి నెందుకు లక్ష్య పెట్టాలి?— ఎవరి ఆశలు ఎవరు నెరవేర్చగలరు?

మాలతి రాజుమనస్సు అర్థం చేసుకుందో లేదో - అర్థం చేసుకునే అంత నిర్లక్ష్యం చేసిందో నిజంగా రాజుకి తెలీదు. అసలు మాలతి పెళ్ళి అంత తొందరగా అయిపోతుం దనికూడా ఎవ్వరూ అనుకోలేదు.

పట్నంలో కాలేజీలో చేరిన మొదటి సంవత్సరంలో వరసగా ఐదారు రోజులు శలవులొస్తే ఇంటికి వచ్చాడు రాజు. రాజు రాకకోసమే ఎదురుచూస్తున్నట్టు సంబరపడింది వాళ్ళమ్మ — నీకో కార్డుముక్క రాసి పడేద్దామా అంటే రోజు లేవీ? నాకూ మొన్న సాయంత్రమే వచ్చింది కబురు. నీకు తెల్లబట్ట లవీ వున్నాయా? అన్నీ మాపుకుని తెచ్చావా?'' అంది.

అసలు సంగతేమిటో అర్థం కాలేదు రాజుకి.

''ఎక్కడికమ్మా వెళ్ళేది?'' అన్నాడు.

''మాలతికి పెళ్ళి కుదిరిందికాదురా! రేపు రాత్రికే ముహూర్తం. మనం ఇవ్వాళైనా బయల్దేరి వెళ్ళకపోతే బావుండదు.''

"మాలతికి పెళ్లా?" అప్రయత్నంగా అన్నాడు. రాజుకి నమ్మబుద్ధి కాలేదు. విచిత్రంగా చూశాడు తల్లికేసి — ''ఇంత తొందరగా మాలతికి పెళ్ళేవిటి?''

"వాళ్ళ బామ్మ ఏడాదినుంచీ మంచం మీదే వుంటోంది. నీకు తెలుసుగా? ఈ మధ్య బొత్తిగా సుస్థీ చేసిందట. తన కళ్ళతో మనవరాలి పెళ్ళి చూస్తానని గోలపెట్టిందట. తగ్గట్టే కాస్త మంచిసంబంధమూ దొరికింది. కుర్రాడు బి. ఏ. పేసయ్యాడట. ఆస్థీ అవీ మంచివేను. అందగాడు కూడాను, పిల్ల ఎలాగూ ఈడేరి యింట వుంది ఓ ఏడాది నుంచీ-ఇక అడ్డేముందీ? అన్నీ కలిసొచ్చాయి. పెళ్ళి చేస్తున్నారు."

అన్నీ విన్నాడు రాజు — అర్థమైంది ఒక్కటే, మాలతికి పెళ్ళి కుదిరిపోయింది - మాలతంటే తన కెంతో యిష్టమని ఎలా చెప్తాడు? ఎవరితో చెప్తాడు?

ఫోర్త్ ఫారంలో చేరిన రాజు మూడేళ్ళ పాటు మేనత్తగారి యింట్లోనే వుండి హైస్కూల్లో చదువుకున్నాడు. మేనత్త కూతురు మాలతిని చూస్తోంటే రాజు కెంతో సిగ్గు ముంచుకువచ్చింది మొట్టమొదటిసారి.

రేవతిలో లేని దేమిటో మాలతిలో వున్న దేమిటో అప్పటికి తెలీలేదు రాజుకి — అయినా మాలతి రాజు కిష్టం. మాలతి నవ్వితే బావుంటుంది. నడిస్తే బావుంటుంది. మాట్లాడితే బావుంటుంది. మాట్లాడకపోయినా బావుంటుంది — మాలతి రేవతి కన్నా ఎంతో బావుంటుంది రాజుకి.

"మాలతికి పెళ్ళి కుదిరిపోయింది" దిగులుపడ్డాడు రాజు — అప్పుడు రాజుకి పదిహేడో సంవత్సరం; మాలతికి పదిహేను వుండవచ్చు. ఆడపిల్ల కాబట్టి పెళ్ళవుతోంది. తన కెందుకు పెళ్ళి చేస్తారు? చెయ్యమని అడిగితే ఏం బావుంటుంది?

"ఒరేయ్! నువ్వలా మూతిముడుచుక్కూర్చుంటే కాదు. పెట్టి సర్దుతున్నాను. నీ బట్టలేవో యిలా తీసుకురా!'' అంది తల్లి. రాజు కేమంత సంతోషంగాలేదు. అయినా బట్టలు తెచ్చాడు. కాంతమ్మ పెట్టిలో సర్దింది– తల్లితో పాటు బండిలో వెళ్లాడు - పెళ్ళికూతురులా కొత్తబట్టలనీ కట్టుకుని నగలు పెట్టుకుని గలగలా మాట్లాడేస్తూ తిరుగుతోన్న మాలతిని చూస్తోంటే రాజుకి సిగ్గు వేసింది.

"నువ్వు రావనుకున్నాను బావా! అత్తయ్య నీకు వుత్తరం రాసిందా? మంచివాడివి. చక్కగా వచ్చావు." అంది నవ్వుతూ. ఏం మాట్లాళ్లేదు రాజు. రాత్రి...ముహూర్తం వేళ పెళ్ళంతా చూశాడు రాజు. మాలతి నవ్వుతూనే కూర్చుంది. మంగళసూత్రాలు కట్టించుకుంది. తలంబ్రాలు పోయించుకుంది. తనూ గబగబా పోసింది. అతని వెనుకాతల

అగ్నిహోత్రం చుట్టూ తిరిగింది. చిన్న కారులో ఎక్కి అతని పక్కన కూర్చుని విడిదింటికి వెళ్ళిపోయింది. పందిట్లో ఎక్కడివాళ్ళక్కడ లేచిపోయారు. అంతా ఖాళీ ఖాళీగా అయిపోయింది — స్థంభాన్ని ఆనుకుని అలాగే నించున్నాడు రాజు. పెళ్ళి పీటలమీద ఒలికిన తలంబ్రాలతో ఆడుకొంటున్నారు చిన్న పిల్లలు.

ఆ పెళ్ళిఅరుగుకేసి చూస్తోంటే తన కోరి కేమిటో తనకు తెలిసింది రాజుకి. మాలతిని తనే చేసుకోవాల్సింది. నిజంగా. తనే పెళ్ళి చేసుకోవాల్సింది.

ఇంట్లోకైనా వెళ్ళకుండా అప్పటి కప్పుడే బయల్దేరి ఏదెనిమిది మైళ్ళు నడిచి తెల్లారే సరికే యింటికి వచ్చేశాడు — ఇంటి తాళాలు తల్లిదగ్గిరే వున్నాయి.

మామయ్యగారింటి కెళ్ళాడు.

"మాలతిఅక్కయ్య పెళ్ళి కెళ్ళ లేదా బావా? అప్పుడే ఎలా వచ్చేశావు?" అంది రేవతి.

"అదేం నా పెళ్ళా? నేను వుండటానికి?" అన్నాడు రాజు కసిగా. శాంతమ్మ కంగారుపడి సాయంత్రానికే యింటికి వచ్చేసింది. రాజుని చెడామడా చివాట్లు వేసింది.

"వచ్చేవాడివి నాతో ఓ ముక్క చెప్పి రాకూడదూ?" అంది.

"నీ గురించి భయపడి వచ్చేశాను గానీ ఈ రాత్రికే మాలతికి శోభనం — అత్తయ్యా మరీ మరీ వుండమని గొడవ చేసింది. నాకూ వుండాలనే వుంది ... నీ కబురు..."

వినకుండానే లేచిపోయాడు రాజు.

తర్వాత గడిచిన ఐదారేళ్ళలోనూ మాలతిని గురించి వింటూనే వున్నాడు ఎప్పటి కప్పుడు — మాలతి అత్తారింటి కెళ్తోందని ఓసారి — వాళ్ళాయన్నే పండక్కి తీసుకొచ్చారని ఓసారీ — వాళ్ళిద్దరూ మద్రాసో ఎక్కడికో వెళ్ళి వచ్చారని ఓసారీ — మాలతి కడుపుతో వుందని ఓసారీ — మగపిల్లాణ్ణి కందని ఓసారీ— మాలతి ముగ్గురు పిల్లల తల్లయింది.



రాజు మాలతిని ఎన్నడూ మర్చిపోలేదు. మర్చిపోవటానికి కూడా ప్రయత్నించలేదు. కావాలనే ఎన్నోసార్లు గుర్తుతెచ్చుకున్నాడు. గుర్తుతెచ్చుకుని బాధపడ్డాడు. తన యిష్టాన్ని వూహామాత్రంగా నైనా అర్థం చేసుకోని మాలతిమీద విపరీతమైన ద్వేషంకూడా వుంది రాజుకి. పెళ్ళయ్యాక మాలతిని చూడలేదు. చూసే అవకాశం వచ్చినా తప్పించుకున్నాడు. ఓ సంక్రాంతిపండక్కి మాలతిని తీసుకొచ్చి పసుపూ కుంకాలు పెట్టి పంపించాలనుకుంటున్నా నని తల్లి రాసిన వుత్తరం చదువుకున్న రాజు ఆ శెలవుల్లో యింటికే రాలేదు. మాలతి వచ్చివెళ్ళిం దనిమాత్రం తెలుసుకున్నాడు.

రేవతి రాజుకి దగ్గిరౌతోన్నకొద్దీ రాజు మాలతికే చేరువయ్యాడు. మాలతి స్మృతిని అధికం చేసుకున్నాడు. ఏం ప్రయోజనం? తన వేదనేమిటో మాలతికి తెలుసా? అమ్మకు తెలుసా? రేవతికి తెలుసా? ఎవరు తనని అర్థం చేసుకోవాలని ప్రయత్నించారు? ఎవరు తన కోరిక తీరలేదని బాధ పడ్డారు?

రాజు దృఢంగా తల తాటించాడు — ఎందుకీ పిరికితనం? పశ్చాత్తాపంతో మగ్గిపోవల్సిన అవసరం తన కేం లేదు. రేవతి కోరిక తీర్చి ఆవిడ ఆశలన్నీ సఫలం చేసే బాధ్యత తన కెంతమాత్రం లేదు. అవును.

తర్వాతవారం పదిరోజుల్లోనే రేవతికి పెళ్ళిసంబంధం కుదిరింది. రాజు విన్నాడు. వూరుకున్నాడు – "అమ్మా ! రేవతి మనింటి కెప్పుడైనా వస్తోందా ?'' అని అడగాలనుకున్నాడు ఓసారి. నోరు పెగలక వూరుకున్నాడు. రేవతి పెళ్ళికి ముహూర్తం కూడా పెట్టారు. అదీ విన్నాడు రాజు – పొయ్యిముందు కూర్చున్న వాళ్ళమ్మ అస్తమానూ కళ్లు తుడుచుకోవటం చూశాడు – ఓ నిముషం గడపదగ్గిరే నిలబడ్డాడు. తల్లి పల్కరించలేదు. కొన్నాళ్ళనుంచీ ఆవిడ కొడుకుతో సరిగ్గా మాట్లాడటం లేదు – వుద్యోగానికి తెలవెందుకు పెట్టావన్న సంగతి కూడా అడగలేదు. పనీ పాటూ లేకుండా యింటి దగ్గిరే ఎందుకు వుంటున్నాడో పట్టించుకోలేదు – అమ్మ అంత ముభావంగా వుంటోంటే రాజుకి చాలా కష్టంవేసింది. తనేం చెయ్యాలి? అమ్మ కోపం ఎలా పోతుంది? రేవతిని పెళ్ళి చేసుకోవాలా? ఎందుకు చేసుకోవాలి? రేవతికి మాత్రం తనంటే ఏం యిష్టం? ఇష్టం వుంటే ఒక్కసారికూడా తన నెందుకు అడగలేదు? ఇంత తొందరగా వేరే పెళ్ళి ఎలా చేసుకుంటోంది? – అమ్మ పిచ్చి కాకపోతే రేవతి తప్పు యింకెవ్వరూ లేరా?

పొయ్యిదగ్గిర కూర్చుని తల్లి ఏడుస్తోందని తెలిసినా లోపలికి వెళ్ళిపోయాడు రాజు.

* * *

రేవతి పెళ్ళి ఒక్కరోజు వుంది–రాత్రి గడిచి తెల్లవారితే రేవతి పెళ్ళిరోజే!

ఆ సాయంత్రం ఎటూ వెళ్ల బుద్ధి కాలేదు రాజుకి. ఫ్లాస్క్‌లో వేడివేడిగా వున్న టీ ఒంచుకుతాగి కిటికీకి దగ్గిరిగా కూర్చున్నాడు.

చావిట్లో మాటలు ... మధ్య మధ్య కమ్మటి నవ్వు–అది...అది ... చాలా పరిచితమైందే రాజుకి.

చటుక్కున కుర్చీలోంచి లేచి గుమ్మం దగ్గిరికి నడిచాడు. మూసివున్న తలుపుల మీద చేతులు వేసి విన్నాడు చాలాసేపు... మాలతి ! మాలతి ! నిజంగా మాలతి !... రాజు హృదయం అతిగా కొట్టుకుంది.

''రేవతి పెళ్ళికి వచ్చిందా మాలతి?''

మాలతే వచ్చింది గదిలోకి.

గిర్రున వెన్కక్కి తిరిగి నించున్నాడు రాజు.

"ఏం చేస్తున్నావు బావా గదిలో కూర్చుని?"–ఆ చనువు ఏడెనిమిదేళ్ళ నాటిది. ఆ మాటలు పెరిగి పెద్దదైన మాలతివి.

"అబ్బో ! చాలా పెద్దవాడి వయ్యావే! నిన్ను చూసి ఎన్నేళ్ళయిందో ! నా పెళ్ళి కనుకుంటాను. మళ్ళా కలుసుకోనేలేదుగా ?"

మాలతి ఎదురుగా వచ్చి నిలబడింది. లేత గులాబీరంగు ఫుల్ వాయిల్‌చీర కట్టుకుంది. మోచేతుల చుట్టూ మెరుస్తోన్న జరీ అంచుతో తెలుపు జాకెట్టు వేసుకుంది. బారుగా వదులుగా వ్రేలాడుతోన్న వాలుజడలో ముద్ద మందారపువ్వు పెట్టుకుంది. ఆ చెంపల్లో – పెదవుల్లో బొత్తిగా పసితనం లేదు. అదో మాదిరిగా హుందాగా కన్పించింది–"మాలతి చిన్నదికాదు.'' మళ్ళా మళ్లా చూడటానికే జంకు కలిగింది రాజుకి.

''ఏం బావా ? ఇంత కాలానికి కనపడితే నోరే విప్పవేం ? షోకా ఏమిటి ?'' మాలతి చొరవ ఎప్పటిలానే వుంది. రాజు మాలతి కళ్ళలోకి సూటిగా చూశాడు. చూపు మరల్చుకోలేదు, నోరు విప్పలేదు. మాలతి కూడా ఓక్షణం చూసింది – "ఏమిటి బావా యిలా చేశావ్ ?"

నోరు పెగుల్చుకున్నాడు రాజు – ''ఎలా చేశాను ?''

''ఎలా చెయ్యటం ఏమిటి ? రేవతికి వేరే సంబంధం దేనికి? తనంటే నీ కిష్టం లేదూ ?''

''నీకు మాత్రం వేరే సంబంధం దేనికి? నేనంటే నీ కిష్టం లేదూ ?'' సూటిగా చూస్తూ అన్నాడు.

ఫక్కుమంది మాలతి–''ఏమిటా హాస్యం? భలేవాడివే !"

నుదురు చిట్లించుకున్నాడు రాజు.

''రేవతికి నువ్వంటే చాల యిష్టంట కదూ? పోనీ ఆ సంగతైనా నీకు తెలుసా''

''ఎందుకు తెలియాలి ? నువ్వంటే నా కెంత యిష్టమో నువ్వు తెలుసుకున్నావా ?"

కాస్త ఆశ్చర్యంగా చూసింది మాలతి. బావ మాట్లాడుతున్నది బొత్తిగా హాస్యం కాదనిపించింది.

"ఏమిటి బావా చిత్రంగా మాట్లాడుతున్నావు ?"

''నీకు చిత్రంగానే వుంటుంది మాలతీ!" బావ కంఠం ఎందుకంత భారంగా పల్కుతోందో అర్థం కాలేదు మాలతికి.

"నువ్వంటే నా కిష్టమన్నసంగతి ఎన్నడైనా గ్రహించావా ?"

విస్మయంగా చూసిందిమాలతి–నవ్వుతూ అంది. "నేనంటే నీకు చాలా యిష్టమా బావా? అయితే నన్ను నువ్వే పెళ్ళి చేసుకోలేక పోయావా?"

"వెటకారం చేస్తున్నావా?"

మళ్ళా నవ్వింది మాలతి – "వెటకారం దేనికి? ఎదురు మేనరికం చెయ్యనని మన చిన్నతనంలోనే మా అమ్మ అనుకుందట. అదీగాక నువ్వు నాకన్న రెండేళ్ళే కాబోలు పెద్దవాడివి. నా పెళ్లికి నువ్వు ఎంత చిన్నవాడిగా వున్నావో తెలుసా? బొత్తిగా మీ అమ్మకొంగు పట్టుకు తిరిగే కుర్రాడిలా వున్నావు – స్థంభానికి ఆనుకు నించుని పెళ్ళంతా చూశావుకదూ ?"

''నీకలా పెళ్ళి చేసుకుంటోంటే ఏడుపు రాలేదూ? బాగా యిష్టం అయ్యిందా?''

"నిజంగా నువ్వు ఇప్పుడు కూడా పసివాడిలాగే మాట్లాడుతున్నావు." కళ్ళతో నవ్వింది మాలతి.

''ఏమో మాలతీ! నీ పెళ్ళయి పోయాక తెలుసుకున్నాను. నిన్ను నేనే పెళ్ళి చేసుకోవల్సిందని..."

మాలతికి విస్మయం కల్గింది.

"ముందే తెలిస్తే ఏం చేసేవాడివి ?"

"అవును ముందే తెలిసినా ఏమీ చెయ్యలేకపోయేవాడిని. నా మనసులో కోరిక ఎవ్వరూ గ్రహించలేదు. కనీసం నువ్వు కూడా..."

"నా మీద నిష్ఠూరం వేస్తున్నావు కదూ?"

"ఏం ప్రయోజనం ? నాకోసం నువ్వేం బాధపడతావా ?"

మాలతికి ఏం మాట్లాడాలో తోచలేదు.

"నిన్ను సోదరిగా భావించుకోవాలని చాలా ప్రయత్నం చేశాను మాలతీ ! నా వశం కాలేదు. నా ఆత్మని నేను వంచించుకోలేకపోయాను. నీతో నేను మానసికంగా అన్ని అనుభూతులూ పొందగలిగానంటే అతిశయోక్తి కాదు. నువ్వు పెళ్ళికూతురుగా వున్నప్పుడు నేను పెళ్ళికొడుకు నయ్యాను. నువ్వు తల్లివైనప్పుడల్లా నేను తండ్రి నయ్యాను. నా హృదయంలోనే ఓ యిల్లు కట్టుకొని నిన్ను యిల్లాలిని చేసుకున్నాను. నీ స్మృతులతో ఎన్నో అనుభవాలు పొందుపర్చుకుంటూవచ్చాను.''

తనేం వింటోందో అర్ధంకాలేదు మాలతికి.

"అంత అకస్మాత్తుగా నీకు పెళ్ళవుతుందని నేననుకోలేదు మాలతీ! నీ పెళ్ళి వరకూ నాకే అర్థం కాని నా మనస్సు నీకెలా తెలియజెయ్యను? అంతవరకూ నేనంటే నీకిష్టమనే అనుకున్నాను." రాజు ధోరణి మాలతికి కొంచెం చిరాకు కూడా కలిగించింది—కళ్ళెత్తి చూస్తూ అంది—"నీకు రేవ తంటే యిష్టం లేదా బావా?"

మాట్లాడ లేదు రాజు,

"నువ్వంటే రేవతికే కాదు రేవ తంటే నీకూ యిష్టమే నని అత్త చాలాసార్లు చెప్పింది! నువ్వు వచ్చినప్పుడల్లా రేవతి యిక్కడే వుంటుందట. నీ సదుపాయా లన్నీ చూస్తుందట. మీ పెళ్ళిమాట ఎత్తినప్పుడల్లా నవ్వు నవ్వుతూ వూరుకునే వాడివట. ఇందులో నిజం కాని దేముంది?"

అగాధాలలోకి కుంచుకు పోతోన్నట్టు నిట్టూర్చాడు రాజు. "నిజమే మాలతీ! అది కూడా నిజమే. రేవతంటే నా కిష్టం లేదని యిప్పటికీ అనలేను. రేవతి చాలా అందంగా వుంటుంది. చాలా మంచిది. నా సుఖం కోసం ఏమైనా చెయ్యగలదని నాకు తెలుసు. రేవతి నా భార్యే అవుతుందనీ, అది భగవంతుడి నిర్ణయ మనే నేను నమ్మాను...కాని...కాని.. నేను చెప్పలేను మాలతీ! నా కేమైందో నాకు తెలీదు. రేవతిని చేసుకోకూడ దనుకున్నాను. చేసుకోనన్నాను. అంతే. నా మనస్సు మార్చుకోలేదు...జరిగింది యిదే!"

అయోమయంగా చూసింది మాలతి—"నీ మాట లేమిటో నాకు బొత్తిగా అర్థం కావటంలేదు బావా! పిచ్చివాడి వయ్యావేమో నన్పిస్తోంది."

"నిన్నింతగా అభిమానించే నేను పిచ్చివాడిగా కన్పిస్తున్నానా మాలతీ?"

"కాకపోతే ఏమిటి? అడవిలో వెన్నెల కాస్తే? బూడిదలో పన్నీరు పోస్తే...? ఏం ప్రయోజనం? నువ్వు నన్ను అభిమానిస్తే అంతే—నా భర్త సమక్షంలో నేను భగవంతుణ్ణికూడా తల్చుకోను. రత్నాల్లాంటి ముగ్గురు పిల్లలతో—అన్ని విధాలా అనుకూలుడైన భర్తతో నేను నా ఇంటిలో స్వర్గసుఖాలు అనుభవిస్తున్నాను—ఇదంతా నేను గర్వంగా అతిశయంగా చెప్పుకోవటం లేదు. ఇన్నేళ్ళూ నువ్వెంత అవివేకంగా గడిపావో అర్థం చేస్తున్నాను—నా కోసం నువ్వు పిచ్చి పిచ్చిగా ఆలోచించావంటే ఏం చెప్పను?"

"........."

"రేవతిని శాశ్వతంగా దూరం చేసుకుని నువ్వెంత దురదృష్టవంతుడివయ్యావో నీకు తెలుసా బావా?"

"నిన్ను దూరం చేసుకున్నదానికంటేనా?"

"ఎంత అమాయకుడివి బావా!" జాలిగా నవ్వింది మాలతి.

"నువ్వు కావా లని ఆరాటపడే రేవతెక్కడ? నీ పేరైనా తల్చుకోని నేనెక్కడ?—నేనంటే నీకంత ఇష్టమే అయితే నిన్ను పొందలేకపోయిన దురదృష్టం నాదికాని నీదికాదు. నన్నే నువ్వు పెళ్ళి చేసుకునివుంటే నా దృష్టిలో నీ కో ప్రత్యేక తేమీలేదు. సర్వసామాన్యమైన వ్యక్తివి. వేదోక్తంగా వివాహం చేసుకున్న భర్తవి—భర్తగా పొందగలిగే గౌరవాభిమానాలు పొందగలవేగాని మరే ఆధిక్యతా లేదు నీకు. కాని రేవతి...? నువ్వు తన ఆరాధ్య దైవానివి! నువ్వు తన ప్రాణంలో ప్రాణానివి! నువ్వే తన ప్రియుడివి; సన్నిహితుడివి!—నీకోసమే రేవతి పుట్టింది. నీకోసమే బ్రతుకుతున్నా నని నమ్మింది. తన ఆశ లన్నీ నీ కోసం నిల్పుకొంది. కాని బావా!...నువ్వు కాదన్నరోజు రేవతి ఏమైపోయిందో...ఏమైపోతుందో ఆలోచించావా?

"మాలతీ!"

"నిజం బావా! రేవతిని పోగొట్టుకున్న నువ్వు సర్వం పోగొట్టుకున్నావు. జీవన జ్యోతిని ఆర్పివేసుకుని జీవితాన్ని అంధకారం చేసుకున్నావు—నిన్ను ఆరాధించేవాళ్ళెవరో అర్థం చేసుకోలేకపోయావు. నువ్వు అక్కర్లేనివాళ్ళకోసం ఆరాట పడ్డావు. ఎందుకు బావా యింత వెర్రిపని చేశావు? ప్రేమించటం కన్నా ప్రేమించబడటమే మహాభాగ్యం కదూ?"

వెర్రివాడిలాగే చూశాడు రాజు.

మాలతి చాలా సేపు మౌనంగా నించుంది.

మాట్లాడకపోయినా మాలతి వేసిన ప్రశ్న ప్రతిధ్వనించింది.

* * *

సన్నాయి విన్పిస్తోనే వుంది—మాలతి ప్రశ్న ప్రతిధ్వనిస్తోంది—

"ఎందుకు బావా యింత వెర్రిపనిచేశావు?"

"ప్రేమించటం కన్నా ప్రేమించబడటం మహాభాగ్యం కాదూ?"

తను...తను...వెర్రిపని చేశాడా? వెర్రివాడై రేవతిని దూరం చేసుకున్నాడా?

ఊహ తెలిసింది మొదలూ గడిచిన పదిపదిహేనేళ్ళ జీవితంలోనూ రేవతి నీడలా తన నెలా వెన్నాడిందో తెలియనిది కాదు—తన కోరిక విన్నంత మాత్రాన తీర్చాలని తాపత్రయపడే రేవతి—తను తప్పు చేశాడని తెలిసినా చిన్నతనంలోనే క్షమించ గలిగిన రేవతి—ఒక్క తన సుఖశాంతులే ధ్యేయంగా ఎంచుకున్న రేవతి...భగవాన్!—ఆ రేవతి యింకెక్కడుంది తనకు? అసలు రేవతిచేసిన నేర మేమిటి? తన కేం అన్యాయం చేసింది? ఎందుకు తను రేవతిని తిరస్కరించాడు? ఎందుకు?...ఎందుకు?

ఫెల్లు మంటూ వినవస్తోన్న బ్యాండు మేళాలమధ్య సన్నాయి పాట అస్పష్టమైపోయింది.

తత్తరపడుతూ లేచాడు రాజారావు. గబగబా మెట్లు దిగి క్రిందికి వచ్చాడు.

తల్లి నిద్రపోవటం లేదు. చీకట్లో మంచం మీద కూర్చునేవుంది.

"అమ్మా!" భారంగా పిల్చాడు రాజు. అలాగే నించున్నాడు అమ్మ పల్కుకోసం.

ఆవిడ వెక్కివెక్కి ఏడవటం విన్పించింది. నెమ్మదిగా అడుగులు కదిల్చాడు.

"నువ్వు శాసించలేకపోయావా అమ్మా?" మెట్లు దిగి వీధిలోకి నడిచాడు. నడక వేగం హెచ్చించాడు.

పెళ్ళి పందిరి దేదీప్యమానంగా కన్పించింది. పురోహితుల మంత్రోచ్చారణ విస్పష్టంగా విన్పించింది. అడుగు ముందుకు సాగలేదు. ఆగిపోయాడు రాజు.

